## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ


దెందులూరు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఇరు వైపులా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల నంబర్లను నమోదు చేసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భీమరాజు, ఏఎస్సై తదితరులున్నారు.

### చల్లాలమ్మకు వెండి కిరీటం సమర్పణ

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ తల్లికి భక్తులు వెండి కిరీటం బహూకరించారు. గ్రామానికి చెందిన నారాయణ వెంకట ప్రసాదరావు, పద్మనాగలక్ష్మి దంపతులు తమ కుమారుడు దీపక్ పుట్టినరోజు సందర్భంగా సుమారు రెండున్నర కేజీల వెండి కిరీటం అమ్మవారికి సమర్పించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దొంతంశెట్టి సత్యనారాయణ, దూసనపూడి లక్ష్మినారాయణ, కొల్లినాగు తదితరులు దాతలను శాలువా కప్పి సత్కరించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయని ఆయన అన్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచారని, ఏలూరు జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం కూడా తెరవకపోవడం బాధాకరమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

### నంది వాహనంపై ఊరేగిన శివయ్య


క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆదివారం రాత్రి నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో అర్చకులు, పండితులు శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి ఈ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిపారు.

### వ్యాపారులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

ద్వారకాతిరుమల: కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారంటూ ఆర్యవైశ్యులను కించపరిచేలా రావులపాలెం బహిరంగ సభలో వర్తక వ్యాపారులపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు, స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు అన్నదాన సదనం ఇన్‌చార్జి యిమ్మిడి నాగేశ్వరరావు(నాగు) ఆదివారం ఖండించారు. చంద్రబాబు వ్యాఖ్యల కారణంగా ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతూ ఎవరైనా పట్టుబడ్డారా అని ఆయన ప్రశ్నించారు. బాబు ఉద్దేశపూర్వకంగానే విమర్శలు చేశారని ఆయన ధ్వజమెత్తారు. కిరాణా వ్యాపారులను గంజాయి అమ్మకందారులుగా చిత్రీకరిస్తున్న చంద్రబాబు దుర్మార్గుడని, సీఎం పదవి దక్కుతుందో లేదోనన్న భయంతో చంద్రబాబు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు. వెంటనే చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, కిరాణా వ్యాపారులకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే తమ ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

### బీరు సీసాతో వ్యక్తిపై దాడి

జంగారెడ్డిగూడెం: బీరుసీసాతో ఒక వ్యక్తిపై దాడి జరిగిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై జ్యోతిబాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన బుద్దుల రమేష్ స్థానికంగా ఉన్న కోత మిషన్‌లో పనిచేస్తున్నాడు. రమేష్ తోడల్లుడు గుండి శ్రీను కుటుంబంతో కలిసి ఈ నెల 6న రమేష్ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రమేష్, శ్రీను స్థానికంగా ఉన్న రెస్టారెంట్‌కు మద్యం సేవించేందుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పట్టణానికి చెందిన ముక్కు శ్రీనుతో వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ముక్కు శ్రీను బీరుసీసాతో దాడి చేయడంతో తాను గాయపడ్డానని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# సంక్షేమ పాలనను ఆదరించండి


వాసుబాబును గెలిపించాలని అర్ధవరంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాము, వైఎస్సార్ సీపీ నాయకులు


మేధినరావుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

**ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ అర్ధవరం రాము**

నిడమర్రు: రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలనను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వచ్చే ఎన్నికల్లో నిజాయితీపరుడైన ఎమ్మెల్యే వాసుబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. ఆదివారం గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుబాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. పింఛన్లు అందాయా లేదా అని వృద్ధులు, వికలాంగులను ఆరా తీశారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటికి అందించే పింఛన్లు ఈనెల అందకుండా కుట్రలు చేసిన టీడీపీ కూటమికి గుణపాఠం చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. పార్టీ సిద్ధాంతాలు, ఎన్నికల హామీలను వివరించారు. మీకు ప్రభుత్వం నుంచి లబ్ధి కలిగితే తప్పకుండా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ దత్తాడి సుభాష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దొడ్డిపట్ల పాండురంగ, ఉపసర్పంచ్ కమ్మిల ఉదయభాస్కరరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు కాకర్లమూడిలో వాసుబాబు ప్రచారం**

ఉంగుటూరు: కాకర్లమూడి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 4 గంటల నుంచి మన గ్రామానికి మన వాసన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామ ప్రజలకు అందిన సంక్షేమం, గ్రామ అభివృద్ధిని వివరించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు కోరారు.

**జగనన్న పాలనకు మద్దతునివ్వండి**

దెందులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధికి, సంక్షేమ పాలనకు ప్రజలంతా మద్దతునిచ్చి మళ్లీ జగనన్న అధికారం చేపట్టేలా భారీ మెజార్టీ అందించాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని కోరారు. ఆదివారం మేధినరావుపాలెం పంచాయతీ కొవ్వలివారిగూడెంలో మేమంతా సిద్ధం కార్యక్రమం సర్పంచ్ ఎం.కనకదుర్గకుమారి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడికొండ కొండయ్య, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు, పొందిన లబ్ధిని గణాంకాలతో వివరించారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిపాటి బీమయ్య, మేడిబోయిన పెద్దిరాజు, సింహాద్రి పండు, జొన్నకూటి మంగారావు, మేతికమెల్లి తాతారావు, కొవ్వలి రాంబాబు, తాడిగడప శ్రీను, కొవ్వలి నాగరాజు, జొన్నకూటి నర్సింహ, బాలిన మల్లిఖార్జున, వజూరి గంగాధరరావు, రొక్కం పాపారావు, మేడిబోయిన రామకృష్ణ, నందిగం రాంబాబు, తుంటా మల్లేశ్వరరావు, శ్రీకాకొల్లు శ్రీను ఉన్నారు.

**ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రచారం**

పెదపాడు: జగన్నను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. పెదపాడు శివారు సత్యనారాయణపురంలో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పథకాలను వివరించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గట్టిం సురేష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలం ఆక్రమణపై మైనింగ్ ఏడీ నివేదిక

దెందులూరు: దెందులూరు టీటీడీ కల్యాణ మండపం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమణకు పాల్పడి గ్రావెల్‌తో మెరక చేసిన ఉదంతంపై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్డీవో, మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల ఉమ్మడి పరిశీలన ముగిసింది. శనివారం అన్ని శాఖల అధికారులు వెంటనే నివేదిక అందజేసినప్పటికీ మైనింగ్ శాఖ ఏడీ ఆలస్యంగా ఇవ్వడంతో కలెక్టర్‌కు పంపాల్సిన నివేదిక ఆలస్యమైందని శనివారం రాత్రి మైనింగ్ ఏడీ నివేదిక ఇవ్వడంతో అందరి నివేదికలతో పాటు మైనింగ్ ఏడీ నివేదికలను పొందుపరిచి పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఏలూరు ఆర్డీవో షేక్ ఖాజావలీ తెలిపారు. ఆ స్థలం కన్వర్షన్ అవ్వకుండా అయిందని సాక్షాత్తు జాయింట్ కలెక్టర్‌కు దెందులూరు మండల రెవెన్యూ అధికారులు అబద్ధం చెప్పారు. జాయింట్ కలెక్టర్ కన్వర్షన్ పత్రాలు చూపించాలని ఆదేశించడంతో స్థల ఆక్రమణ, గ్రావెల్‌తో కూడిన మెరక అంశాలు బయట పడిన సంగతి విదితమే. ఈ ఘటనపై జాయింట్ కలెక్టర్, ఏలూరు ఆర్డీవో పూర్తిస్థాయి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో నాలుగు శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఉమ్మడి పరిశీలన నిర్వహించి నివేదిక సిద్ధం చేశారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : బాపిరాజుగూడెం పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురానికి చెందిన 17 ఏళ్ల బాలిక నాలుగు రోజులుగా కనిపించడంలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈనెల 3న సాయంత్రం బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పెదవేగి పోలీస్‌స్టేషన్లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ


పూళ్లలో నిరుపేదలకు నిత్యవసరాలు అందిస్తున్న మానవత మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్

భీమడోలు: పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో ఆదివారం మానవత మండల శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎంపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి మంగమ్మ, పైడి చిన్నమ్మ, చిట్టూరి కాళీమాత, సలాది లక్ష్మీ, వాసిరెడ్డి మద్దిరావమ్మలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వట్టి సీతారామయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. సాయిరామ్ క్లాత్ షోరూమ్ నిర్వాహకులు పున్నం గోపి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం దాతలు పుప్పాల రామ్మోహనరావు, పుప్పాల వెంకట్రామయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శి ఆడబాల శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శి అల్లాడ ప్రసాద్, పూర్వపు మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు దోకల పెద చిన్నారావు సభ్యులు పాల్గొన్నారు.

## రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలందుకుంటున్న రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం పూజా టికెట్లపై రూ.30,105, విరాళాలద్వారా రూ.8,977, లడ్డూ ప్రసాదం విక్రయంపై రూ.17,970, ఫొటోల అమ్మకంపై రూ.3,260, మొత్తం రూ. 60,312 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. సతీష్‌కుమార్ తెలిపారు.

## గర్భకోశ వ్యాధులపై నిర్లక్ష్యం తగదు


సదస్సులో మాట్లాడుతున్న స్త్రీవైద్య నిపుణులు సురేఖ

గణపవరం: మహిళలు గర్భకోశవ్యాధులపై నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్యసేవలు పొందితే వ్యాధి నివారణ సాధ్యమని, లేదంటే ప్రాణాంతకంగా మారతాయని ప్రముఖ స్త్రీవైద్య నిపుణురాలు కె.సురేఖ అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గణపవరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆపరేషన్‌లు లేకుండా నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భసంచి వ్యాధులపై నిర్లక్ష్యం తగదన్నారు. ఎముకల వైద్యనిపుణులు సాయిపృథ్వీ ఎముకలు, కీళ్లు, జాయింట్ రీప్లేస్‌మెంట్, వెన్నుపూస వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

## వేటూరి రమాదేవికి గాన తరంగిణి బిరుదు ప్రదానం


రమాదేవికి బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రముఖ గాయని, హైదరాబాద్ ఘంటసాల సంగీత కళాశాల మాజీ ప్రిన్స్‌పాల్ వేటూరి రమాదేవికి గాన తరంగిణి బిరుదు ప్రదానం కార్యక్రమం ఏలూరులోని వైఎంహెచ్ హాలులో జరిగింది. నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం సంస్థ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో తేట తేట తెలుగులా ఘంటసాల గాన వినోదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గాన గంధర్వుడు ఘంటసాల తెలుగు ప్రజలకు లభించిన గొప్ప వరమన్నారు. ఘంటసాల భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన పాడిన పాటలు అజరామరంగా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. ఇప్పటికీ అనేక మంది ఔత్సాహిక గాయకులకు ఘంటసాల స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. అనంతరం పలువురు గాయనీ గాయకులు అర్జునరావు, లంకా వెంకటేశ్వర్లు, పీ. సూర్యప్రకాష్, వహీదా వాసు, బీకే బిందు, ఆష, నవీన, హర్షిత తదితరులు ఘంటసాల పాడిన అనేక హిట్ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. ఈ కార్యక్రమానికి ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌ఎం సుభాని అధ్యక్షత వహించగా స్వర పీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఏ. వీరభద్ర రావు, గుడిపాటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు జూట్ మిల్లు మూసివేత తగదు

ఏలూరు (టూటౌన్): కొత్తూరు కృష్ణా హెస్సియన్ జూట్ మిల్లును యాజమాన్యం ఈ నెల 8 నుంచి మూసి వేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడాన్ని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కొంతకాలంగా కార్మికులకు పనులు లేకుండా చేసి ఒక పథకం ప్రకారం మిల్లును అక్రమంగా మూసివేశారన్నారు. ఏలూరు మిల్లు మూసి వేసి కార్మికులను బజారున పడేసి లాభాలు పొందాలని చూస్తున్నారన్నారు. ఈ చర్యను ప్రభుత్వం నిలువరించాలని కోరారు. దురుద్దేశంతో యాజమాన్యం మిల్లు మూసివేతకు పాల్పడుతున్నందున అందుకు అనుమతి ఇవ్వకుండా మరెవరైనా తీసుకొని నడిపించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలన్నారు. ప్రభుత్వం మిల్లును నడిచే విధంగా చర్యలు తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని బద్దా వెంకట్రావు కోరారు.

## వైఎస్ జగన్ వెంటే ప్రభుత్వ ఉద్యోగులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరిగి అధికారం చేపట్టబోతున్నారని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గెడ్డం సుధీర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రజలను వంచించడంతో ముఖ్యమంత్రిగా జగన్‌ను ప్రజలు ఏకపక్షంగా ఎన్నుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. అమ్మ ఒడి, మన బడి నాడు – నేడు, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, వంటి పథకాలతో పేదలను ఆదుకోవడంతో పాటు 1998 డీఎస్సీ అర్హులకు ఉద్యోగాలు, గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 4 లక్షలకు పైగా ఉద్యోగాలిచ్చిన గొప్ప నేత జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దుష్టకూటమికి చెంపపెట్టులా ఈ ఎన్నికల్లో ప్రజలు ఆయా పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం, ప్రత్యేక రాయితీలు అందజేత, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వంటి చర్యలతో ప్రభుత్వ ఉద్యోగులు సైతం జగన్ వెంటే ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా వెల్లడవుతున్న అనేక సర్వేల్లో వస్తున్న ఫలితాలు, జగన్ బస్సు యాత్రకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూస్తుంటే వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని నిరూపిస్తున్నాయన్నారు.

## 11న ఏలూరులో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 11న ఏలూరులో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అబ్రహం, గ్యారీ కాస్పరోవ్ చెస్ అకాడమీ డైరెక్టర్ యోహనాన్ తెలిపారు. స్థానిక సిద్దార్థ క్వెస్ట్ స్కూల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోటీలు కొనసాగుతాయని వెల్లడించారు. పోటీలకు అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరుకానున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కార్పొరేటర్ ఈదుపుగంటి శ్రీదేవి చేతుల మీదగా బ్రోచర్ ప్రారంభించారు.

# పేదల ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత
- రూ.13.50 కోట్లతో మూడు సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- అన్ని ఇళ్లకు ఉచితంగా కనెక్షన్
- లబ్ధిదారుల హర్షం


లక్ష్మీపురం జగనన్న కాలనీలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్


పోణంగి జగనన్న కాలనీ శివారులో విద్యుత్ లైన్ల ఏర్పాటు (ఫైల్)


శనివారపుపేట జగనన్న కాలనీలో ఇంటింటికీ విద్యుత్ లైన్లు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట వేశారు. సంక్షేమ పథకం ఏదైనప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేశారు. దీనికి ఉదాహరణగా జగనన్న కాలనీలు నిలుస్తున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసింది. ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా పెద్ద ఎత్తున మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. ఇందులో ప్రధానమైనవి విద్యుత్ సరఫరా కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించింది. ఏలూరు నియోజకవర్గంలోని లక్ష్మీపురం, పోణంగి, కొమడవోలు జగనన్న కాలనీల్లో నివసించే పేదల ఇళ్లకు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు. మూడు కాలనీల్లో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఒక్కొక్క సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.4.50 కోట్ల చొప్పున రూ.13.50 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి కాలనీలో సుమారు 5 నుంచి 10 సెంట్లు భూమిలో అధికారులు 3 సబ్‌స్టేషన్లు నిర్మించారు. ఇందులో 80 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి ప్రతి రోడ్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలతో లైన్లు లాగారు. ఇంటింటికీ ఉచిత కరెంట్ కనెక్షన్ ఇచ్చారు.

**24 గంటలు కరెంట్ సరఫరా**

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో నివసించే ప్రజలు కరెంట్ కష్టాలు ఎదుర్కొన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గులు, కోతలు ఏర్పడ్డాయి. ఇళ్లకు నాణ్యమైన కరెంట్ సరఫరా కాలేదు. ఫలితంగా వేసవికాలంలో ప్రజలు నానా కష్టాలుపడ్డారు. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల్లోని ప్రజలు భవిష్యత్తులో కరెంట్ కష్టాలు ఎదుర్కొనకుండా ముందుగానే సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో అధికారులు ప్రణాళిక రూపొందించి సబ్‌స్టేషన్లు ఏర్పాటుచేసి కరెంట్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యరాకుండా చూసేందుకు ప్రతి సబ్‌స్టేషన్‌లో నలుగురు సిబ్బందిని నియమించారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగంగాచేశారు. ఫలితంగా ఇప్పుడు జగనన్నకాలనీల్లో వందల కుటుంబాలు విద్యుత్ సమస్యలు లేకుండా పిల్లా, పాపలతో సంతోషంగా జీవిస్తున్నారు.

### సంతోషంగా ఉంది



జగనన్న కాలనీల్లో కరెంట్ సమస్య ఉంటే ఇల్లు ఎలా కట్టుకోవాలో అని మదనపడేవాళ్లం. ప్రభుత్వం కరెంట్ సమస్య లేకుండా చేసింది. ఇంటింటికీ నిరంతరం కరెంట్ సరఫరాకు అవసరమైన స్తంభాలు వేసి కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. మాకు సొంతిల్లు కట్టుకోవాలన్న కల జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా తీరింది. ఫలితంగా ఇప్పుడు జగనన్న కాలనీల్లో వందల కుటుంబాలు పిల్లా, పాపలతో జీవిస్తున్నారు.

– షేక్ సలీమా, లక్ష్మీపురం

### ప్రభుత్వం ఇల్లు ఇచ్చింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన స్థలంలో నేను ఇల్లు కట్టుకున్నాను. ప్రభుత్వం స్థలం ఇచ్చి చేతులు దులుపుకోలేదు. ఉండడానికి అన్ని వసతులు ఏర్పాటు చేసింది. ఒక్కపైసా కూడా చెల్లించకుండా అధికారులు ఉచితంగా కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. ఇప్పటికే రోడ్లు వేశారు. నీటి వసతి కల్పించారు. ఇక ముందు ఇంకా అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉంది. అందుకే నా లాంటి పేద కుటుంబాలు ఎన్నో ఇక్కడకు వచ్చి ఉంటున్నారు.

– దండు లక్ష్మి, లక్ష్మీపురం

## పాఠశాలల సమయాన్ని కుదించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల పని వేళలను కుదించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు కోరారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటోందని, కావున పాఠశాలలను ఉదయం 11.30 గంటల వరకే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ప్రస్తుతం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో ఇంటికి చేరుతున్న క్రమంలో వడగాల్పుల బారిన పడే ప్రమాదం ఉందని, ఉన్నత పాఠశాలల్లో విలీనమైన 3,4,5 తరగతుల విద్యార్థుల గృహాలు పాఠశాలలకు దూరంగా ఉండడం వల్ల మరింత ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూల్యాంకన విధుల్లో పని చేస్తున్న స్పెషల్ అసిస్టెంట్లకు కూడా ప్రయాణ భత్యం, కరువు భత్యం ఇచ్చేలా సవరణ ఉత్తర్వులివ్వాలని కోరారు.